క్లుప్తంగా

అగస్త్యేశ్వరుని ఆలయంలో లక్ష కుంకుమార్చన



అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

కపిలేశ్వరపురం: మండలంలో ఉన్న అగస్త్యేశ్వర పాప వినాశేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల పర్యవేక్షణలో దేవతామూర్తులకు లక్ష కుంకుమార్చన పూజ, గోపూజ నిర్వహించారు. పండితుల వేద మంత్రాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

టీకాలతోనే పశువుల సంరక్షణ



పశువు వేసే టీకా ప్రక్రియను పరిశీలిస్తున్న డాక్టర్ అనిత

కపిలేశ్వరపురం: సకాలంలో కాలానుగుణ టీకాలను వేయడం ద్వారా పశువులను సంరక్షించుకోవచ్చని పశు సంవర్థక శాఖ ఏడీఏ డాక్టర్ ఎల్.అనిత అన్నారు. మండలంలోని కోరుమిల్లి, మాచర గ్రామాల్లో మంగళవారం బ్రుసెల్లోసిస్ వ్యాధి టీకాలు వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 21వ జాతీయ పశుగణన సర్వే తీరును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ బ్రుసెల్లోసిస్ టీకాతో పశువుకు జీవిత కాలంలో వ్యాధి సోకదని చెప్పారు. ఆమె వెంట మండలంలోని పశు వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆధార్ నవీకరణ శిబిరాలు నిర్వహించారు. ఎంపీడీఓ కె.రత్న కుమారి పర్యవేక్షణలో వెదురుమూడి, వాకతిప్ప, నల్లూరు సచివాలయాల్లో నిర్వహించిన శిబిరాల్లో విద్యార్థుల ఆధార్ వివరాలను నవీకరించారు. ఆయా శిబిరాల్లో కపిలేశ్వరపురం, వల్లూరు, టేకి సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్ర సేవలందించారు. విద్యాపరమైన అంశాల్లో ప్రభుత్వ లబ్ధిని పొందడంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు విద్యార్థుల ఆధార్ వివరాలను నవీకరించారు. బుధవారమూ ఆయా కేంద్రాల్లో శిబిరాలు కొనసాగుతాయని, 28, 29 తేదీలలో అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాల, కోరుమిల్లి సచివాలయాల్లో శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రత్నకుమారి తెలిపారు.

వ్యాసరచనలో విద్యార్థిని ప్రతిభ



ప్రథమ స్థానం సాధించిన తులసి

కె.గంగవరం: మండల స్థాయిలో ఏపీఏస్సీసీడబ్ల్యూఏ ఆధ్వర్యంలో నిర్వహించిన వాసరచన పోటీల్లో ఈతకోట ప్రాథమిక పాఠశాల విద్యార్థి పిల్లి మీనా తులసి ప్రతిభ కనబరిచింది. రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ పాత్ర అంశంపై ఇటీవల మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తులసి ప్రథమ స్థానం సాధించి ప్రతిభ చూపించింది. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి తులసీని ఎంఈఓ ఎ.నాగరాజు, ఎస్ఎంసీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

రాయవరం: వెదురుపాక గ్రామంలోని గీతా జ్ఞాన మందిరం వద్ద మందిర నిర్వాహకులు, ఆధ్యాత్మికవేత్త సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పవిత్ర కార్తిక మాసం సందర్భంగా ప్రతిరోజు తెల్లవారుజామున నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం ఏకాదశి మహా పర్వదినం సందర్భంగా సామూహిక శ్రీరమా సహిత వీరవెంకట సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. ఇటికరాల సుబ్రహ్మణ్య శర్మ, అంగర జనార్థన చార్యులు వ్రత పురోహితులుగా సుమారు వంద మంది దంపతులు వ్రతాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాడి శ్రీనివాస్ రెడ్డి, బుల్లి వెంకటరెడ్డి సోదరులు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ క్రతువులో నాగులపల్లి వీర వెంకట సత్యనారాయణ, పడాల శివ మణికంఠ రెడ్డి, సత్సంగ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిధులు మంజూరు

రాయవరం: కూర్మాపురం వి.శేషమ్మ ప్రాథమిక సహకార పరపతి సంఘ ఆవరణ రక్షణ గోడకు రూ.15 లక్షలు మంజూరైనట్టు మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి మంగళవారం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సెంట్రల్ మార్కెటింగ్ ఫండ్స్ నుంచి ఈ నిధులు మంజూరైనట్టు చెప్పారు.

శ్రామికుడికి ఆసరా ఈ-శ్రమ్

- అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు
- శ్రమ జీవుల ఆర్థిక, సామాజిక భద్రతకు దోహదం
- లేబర్ కార్యాలయం, సచివాలయాల్లో నమోదు
- రెండు నియోజకవర్గాల్లో అసంఖ్యాక కార్మికులు



కేదారిలంకలో శ్రమిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కపిలేశ్వరపురం: శ్రమ జీవికి ఆసరాగా ఈ-శ్రమ్ పథకం అమలవుతోంది. ఎలాంటి చిరునామా లేకుండా వ్యాపార కార్యకలాపాలు చేసే చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ పథకాన్ని రూపొందించింది. క్షేత్ర స్థాయిలో కార్మికుల వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వ కార్మిక శాఖ పర్యవేక్షణలో చర్యలు చేపట్టింది.

రెండు నియోజకవర్గాల్లో ఇలా..

మండపేట నియోజకవర్గంలో 43, రామచంద్రపురంలో 77 మొత్తం 120 గ్రామాల్లో పంచాయతీ కార్మికులు రోజువారీ శ్రమ చేస్తున్నారు. కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లోని లంక గ్రామాల్లో కొబ్బరి ఒలుపు కార్మికులున్నారు. కపిలేశ్వరపురం, రాయవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వందలాని మంది అంగన్‌వాడీ, ఆయాలున్నారు. కపిలేశ్వరపురం, మండపేట పట్టణం, కె.గంగవరం మండలాల్లో విస్తారంగా మత్యకార్మికులున్నారు. మండపేట పరిసర గ్రామాల్లో 120కి పైగా రైస్‌మిల్లులు, రెండు పేపర్ మిల్లులు, మూడు ఆయిల్ ఫ్యాక్టరీల్లో వందల మంది కార్మికులు శ్రమిస్తున్నారు. బలమైన కోళ్ల పరిశ్రమ ద్వారా ఇతర ప్రాంతాలకు గుడ్లు ఎగుమతి సాగుతుంది. మండపేట నియోజకవర్గంలో సుమారు 300 ఇటుక బట్టీల్లో 3 వేల మంది వలస కార్మికులున్నారు. రామచంద్రపురం, మండపేట, కపిలేశ్వరపురం ప్రాంతాల్లో అసంఖ్యాకంగా భవన నిర్మాణ కార్మికులున్నారు.

పథకం లక్ష్యం ఇదీ..

పెద్ద వ్యాపారులు వ్యాపార సంస్థను ప్రభుత్వం వద్ద నమోదు చేసుకుని తమ కార్యకలాపాలు కొనసాగిస్తుంటాయి. వాటికి గుర్తింపు, రుణ సాయం తదితర సదుపాయాలంటూ ఉంటాయి. వలస, అసంఘటిత రంగ కార్మికులకు, చిరు వ్యాపారులకు అటువంటివి దక్కవు. వారికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాలన్న లక్ష్యంతో కేంద్రం ఈ పథకాన్ని రూపొందించింది. ఆయా విభాగాల్లోని శ్రామికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

అర్హులు వీరే..

16 నుంచి 59 ఏళ్లు కలిగిన నిర్మాణ వర్కర్లు, వలస కార్మికులు, ఇంటి పనివారు, వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశుపోషకులు, తోలు కార్మికులు, వడ్రంగి, ఉప్పు కార్మికులు, ఇటుక బట్టీ కార్మికులు, వీధి వ్యాపారులు, ఆటో, రిక్షా కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, షాపులలో పనిచేసే సిబ్బంది, ఈఎస్ఐ, పీఎఫ్ పొందే అర్హత లేనివారు ఈ పథకంలో లబ్ధి పొందేందుకు అర్హులు.

ఇవీ ప్రయోజనాలు

విపత్తుల కాలంలో శ్రామికులను ఆదుకునే దిశగా ఈ పథకాన్ని రూపొందించారు. ఈ పథకంలో ఒక్కసారి నమోదైతే సరిపోతుంది. రెన్యువల్ చేయించనవసరం లేకుండా, జీవితాంతం వివరాలు వెబ్‌సైట్లో ఉంటాయి. వృత్తి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను పొందేందుకు ఈ కార్డు ఉపకరిస్తుంది. అసంఘటిత కార్మికుల సామాజిక భద్రత చట్టం కింద ప్రయోజనాలు పొందేందుకు ఈ నమోదు అవసరం. సంస్థల్లో పనిచేసే వారికి సంస్థ ద్వారా గుర్తింపుతో పాటు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు లభిస్తాయి. కానీ అసంఘటితంగా ఉన్న కార్మికులకు ఎలాంటి గుర్తింపు, సదుపాయాలు లేవు. ఈ విషయమై ఇటీవల సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలనిచ్చింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రాల్లో అసంఘటితంగా ఉన్న కార్మికులందరినీ గుర్తించి, గుర్తింపు కార్డు జారీ ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. దీంతో కార్మిక కుటుంబానికి సామాజిక భద్రత కలుగుతుంది. కార్డు కలిగిన వారికి రూ.2 లక్షల ప్రమాద బీమా, పనిలో ఉండగా అంగవైకల్యం కలిగితే రూ.1 లక్ష ఆర్థిక సాయం అందిస్తారు.

ఇలా నమోదు చేయాలి

కార్మికులు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు. ఉచితంగా వివరాలను నమోదు చేసి యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఎన్ఏ) గుర్తింపు కార్డును సైతం జారీ చేస్తారు. సమీపంలోని వార్డు, గ్రామ సచివాలయం, సీఎస్‌సీ సెంటర్, మండపేటలోని లేబర్ ఆఫీసర్ కార్యాలయంలో ఈ-శ్రమ్‌లో వివరాలను నమోదు చేస్తారు. కార్మికుడు తన ఆధార్, బ్యాంక్ ఖాతాల జెరాక్స్ కాపీలతో పాటు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోను తీసుకెళ్లాలి. నామినీ ఆధార్, బ్యాంక్ ఖాతాల జెరాక్స్ కాపీలను కూడా ఇవ్వాలి. కార్మికుడు ఎవరి వద్ద పని చేస్తున్నాడో వెల్లడి చేయాల్సిన అవసరం లేదు. ఏ వృత్తి చేస్తున్నాడో చెబితే సరిపోతుంది. ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం లేని, ఇన్‌కంటాక్స్ పరిధిలో లేని కార్మికులు నమోదు చేసుకోవచ్చు. కోటి రూపాయిల లోపు టర్నోవర్ ఉన్న చిరు వ్యాపారులు నమోదు చేసుకోవచ్చు.

> **ఇది నిరంతర ప్రక్రియ**
>
> 
>
> ఈ-శ్రమ్ నమోదుపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. రెండు నియోజకవర్గాల పరిధిలో మండపేట, రాయవరం, రామచంద్రపురంలో సహాయ కార్మికాధికారి కార్యాలయాలున్నాయి. వాటితో పాటు సీఎస్‌సీ, గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఇది నిరంతర ప్రక్రియ.
>
> – కాశి శివనాగ మల్లేశ్వరరావు, సహాయ కార్మికాధికారి, మండపేట

సౌకర్యవంతంగా ధాన్యం కొనుగోలు

ఆర్డీఓ అఖిల



టేకిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ అఖిల

కపిలేశ్వరపురం: రైతులందరికీ సౌకర్యవంతంగా ఉండేలా ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టినట్టు రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిల అన్నారు. మండలంలోని టేకి రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలు, వివరాల నమోదు, రైసుమిల్లులకు తరలింపు ప్రక్రియ, రైతుకు సొమ్ము చెల్లింపు తదితర అంశాలపై క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. తహసీల్దార్ ఎం.చిన్నారావు, ఏఓ కేవీఎస్ రమేష్‌కుమార్, వీఆర్వో పెద్దింశెట్టి నాగమణి, వెంకటేశ్వరరావు తదితర అధికారులను ఆరా తీసి, పలు సూచనలు చేశారు.

ఇసుక ర్యాంపుల పరిశీలన

కపిలేశ్వరపురం 1, తాతపూడి గ్రామాల్లోని ఇసుక ర్యాంపులను ఆర్డీఓ అఖిల పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమై, ఉచిత ఇసుక విధానం అమలు తీరుపై సూచనలు చేశారు. నిబంధనల మేరకు లబ్ధిదారులకు ఉచిత ఇసుక లభ్యమయ్యేలా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మార్కెట్‌లో ఆక్రమణలపై కమిషనర్ ఆగ్రహం

- కొనుగోలుదారులకు ఇబ్బంది ఉండరాదని ఆదేశం
- దుకాణాలను పరిశుభ్రంగా ఉంచాలని హెచ్చరిక



సంత మార్కెట్లో ఆకస్మిక తనిఖీ చేస్తున్న కమిషనర్

మండపేట: కేపీ రోడ్డులోని సర్దార్ వేగుళ్ల వీర్రాజు సంత మార్కెట్ ఆక్రమణలతో ఇరుకుగా మారిందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు దుకాణదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం శానిటేషన్, సచివాలయ సిబ్బందితో కలిసి సంత మార్కెట్‌లో పర్యటించారు. మార్కెట్ లోపల ఎడాపెడా కూరగాయలు, కిరాణా దుకాణాలతో ఇరుకు ప్రదేశంగా మారడంతో కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. ఎవరికి కేటాయించిన షాపుల్లో వారు దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగించాలి మినహా, చిన్నపాటి రహదారినీ మూసేసి వ్యాపారాలు సాగించడం పద్ధతి కాదని హెచ్చరించారు. రోడ్డును ఆక్రమించకుండా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కొనుగోలుదారుల సౌలభ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని మసలుకోవాలని సూచించారు. ఆక్రమణలు తొలగించాలని, మరోసారి వచ్చి పరిశీలిస్తానన్నారు. ఆక్రమణలు తొలగిచని పక్షంలో భారీ జరిమానా కట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే మెయిన్ రోడ్డు చిన్నకార్ల స్టాండ్ ఎదురుగా ఉన్న రోడ్డు మీదుగా మార్కెట్‌కు వెళ్లేదారిని కూడా ఆయన పరిశీలించారు. స్వీట్ స్టాళ్లు, చిరు వ్యాపారుల బళ్ల వద్ద పరిసరాలను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న షాపు యజమానులను మందలించారు. తిను బండరాల దుకాణాల వద్ద శుభ్రంగా లేకపోతే సీజ్ చేస్తామన్నారు. క్రిమికీటకాలు చేరిన ఆహార పదార్థాలతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. పట్టణంలోని హోటళ్లు, స్వీట్‌స్టాళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, ఇతర తిను బండరాల దుకాణదార్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కమిషనర్ వెంట ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, పట్టణ ప్రణాళిక, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



వీహెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న జయరాజు

మండపేట: వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) 18వ ఆవిర్భావ దినోత్సవాన్ని సంఘ నాయకులు పట్టణంలో వేడుకగా నిర్వహించారు. ధర్మగుండం చెరువు గట్టు వెనుక ఉన్న దివ్యాంగుల భవనంలో మంగళవారం సమితి జిల్లా అధ్యక్షుడు షేక్ నబీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు ముఖ్య అతిథిగా హాజరై, సంస్థ జెండాను ఎగురవేశారు. అనంతరం మాదిగ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి డోకుబుర్ర రాజబాబు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. జయరాజు మాట్లాడుతూ, మాదిగ రిజర్వేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ 2007 నవంబర్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితిని స్థాపించారని గుర్తుచేశారు. అప్పటి నుంచి అనేక ఉద్యమాలు చేసి, రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.6 వేలకు సాధించిచినట్టు వివరించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర నాయకుడు మేడిశెట్టి రాంబాబు, జిల్లా నాయకుడు బొజ్జ రామకృష్ణ, రామకృష్ణ, శెనగల భవాని, కుడిపూడి శ్రీను, అనుసూరి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రిస్టియన్ కౌన్సిల్ సమావేశం

మండపేట: మండపేటలో బుధ, గురువారాల్లో నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ జాతీయ కార్యవర్గ సమావేశం జరగనున్నట్టు సంఘ జాతీయ కార్యదర్శి సంగీత పాల్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, పట్టణంలో పెద్ద కాలువ సమీపంలోని మహిమ కిరీటం సంఘం సన్నిధిలో సమావేశం జరగనున్నట్టు చెప్పారు. దేశంలో 28 రాష్ట్రాల్లో 17 విభాగాలతో కౌన్సిల్ పనిచేస్తుందన్నారు. ఈ సమావేశానికి జాతీయ, రాష్ట్ర ప్రతినిధులైన డాక్టర్ శ్యాం పాల్ కొలకలూరి, డాక్టర్ స్టీఫెన్ చిట్టిబాబు, సిల్వియా జైదీప్ హాజరవుతారని తెలిపారు. ముఖ్యఅతిథిగా ఈశాన్య రాష్ట్రాల అధ్యక్షుడు ఎన్‌కే గురుంగ్ వస్తున్నట్టు చెప్పారు.

వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకలు



ఉప్పుమిల్లిలో నిర్వహిస్తున్న వనసమారాధన

కాజులూరు: కార్తికమాసంలో నిర్వహిస్తున్న వనసమారాధనలు గ్రామాల్లో వివిధ కులాల మధ్య ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తున్నాయని మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు వరదా శేషారావు అన్నారు. మంగళవారం ఉప్పుమిల్లిలో ఆర్యావైశ్య సంఘం సభ్యులు వరదా శేషారావు, వెంకటనాగేశ్వరరావుల ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన ఘనంగా జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో మానవుని జీవితం యాంత్రీకరణగా మారిపోయిందని మనిషికి, మనిషికీ మధ్య ఆప్యాయతలు కరువైపోతున్నాయన్నారు. ఈ వనసమారాధనల వలన అందరూ ఒకచోట చేరి సహపంక్తి భోజనాలు చేయడం ద్వారా ఐకమత్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.అశోక్, ఆర్ఐ వేగేశ్వరరావు, వరదా వెంకటరామమూర్తి, మండల గ్రామాలకు చెందిన వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, పలువురు అధికారులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఆత్మ పీడీ జ్యోతిర్మయి

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదల రైతు సేవాకేంద్రంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆత్మ పీడీ జ్యోతిర్మయి మాట్లాడుతూ రబీ పంట కాలానికి ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలు, ఎరువుల యాజమాన్యంపై రైతులకు వివరించారు. ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ విత్తనశుద్ధి చేసుకునే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. రబీ పంటకు విత్తనాలు ఎంచుకోవడం, భూసార కార్డుల గురించి వివరించారు. ఏఓ సత్యప్రసాద్ మాట్లాడుతూ తుపాను ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో కోతలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవడంపై పలు అంశాలను రైతులకు వివరించారు. మండల హార్టీకల్చర్ అధికారి అనూష మాట్లాడుతూ కూరగాయలు, ఆయిల్‌పామ్, కొబ్బరి, మామిడి మొక్కల సబ్సిడీ, పెంపకం వివరాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏ శ్రీదేవి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగ లక్ష్య సాధనకు శ్రమించాలి

కపిలేశ్వరపురం: ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగ లక్ష్య సాధనే ధ్యేయంగా శ్రమించాలని ఎంపీడీఓ కె.రత్నకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు ప్రతిభా పోటీలను నిర్వహించారు. విజేతలకు ఎంపీడీఓ రత్నకుమారి బహుమతులను అందజేశారు. ఈఓపీఆర్‌డీ ఆర్ఎంవీవీఎస్ ఈశ్వరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి పెట్టండి

కౌన్సిల్ సభ్యుల విజ్ఞప్తి



రామచంద్రపురంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కౌన్సిలర్లు

రామచంద్రపురం: పట్టణంలో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టి వార్డుల వారీగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పలువురు కౌన్సిల్ సభ్యులు విన్నవించారు. పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రవేశపెట్టిన నాలుగు అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. తొలుత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న వీధిలైట్లు కొన్ని వెలగటం లేదని తెలుపగా టెండర్లు పిలిచామని త్వరలోనే కొత్త లైట్లు అమరుస్తారని కమిషనర్ అయ్యప్పనాయుడు తెలిపారు. పెంటపాటి దేవి మాట్లాడుతూ టెండర్లు పిలిచిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసే విధంగా చూడాలని కోరారు. పట్టణంలో ప్రతి వార్డులోని వార్డుల వారీగా పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ శ్రీదేవి తెలిపారు. మున్సిపాలిటీ అధికారులు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ మెంబర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



కాజులూరులో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు



కె.గంగవరంలో బహుమతులు అందుకున్న విద్యార్థులు



వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్ తదితరులు

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం భారత రాజ్యాంగ ఆవిష్కరణ దినోత్సవాన్ని స్థానిక నాయకులు, ప్రజలు ఘనంగా నిర్వహించారు. కాజులూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మాత భారతి ఆధ్వర్యంలోనూ, ఆర్యావటంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలోనూ, గొల్లపాలెంలో ఎంపీటీసీ జొన్నకూటి వెంకటపద్మజ ఆధ్వర్యంలోనూ, దుగ్గుదుర్రులో వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పోతు శ్రీనివాసు ఆధ్వర్యంలోనూ రాజ్యాంగ ఆవిష్కరణ దినోత్సవాన్ని నిర్వహించి బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాజులూరు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం పి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో భారతదేశ సంప్రదాయాలపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అంబేడ్కర్ రచనాశైలి, భారత రాజ్యాంగం గొప్పదనాన్ని వివరించారు. భారత రాజ్యాంగంపై వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: భారత రాజ్యాంగ దినోవ్సవాన్ని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ముందుకు నడిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మండల కేంద్రమైన ఎమ్మార్సీ వద్ద మండల ఎస్సీ ఉద్యోగల సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాచరచన, వకృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈఓపీఆర్డీ గౌరికుమారి, ఏంఈఓ ఆంజనేయులు, హెచ్ఎం వెంకటేశ్వరరావు, సీనియర్ హెచ్ఎం పుల్లయ్య, సంఘం సభ్యులు ప్రేమ్‌కుమార్, రవి, కె.కృష్ణమూర్తి, నరసింహమూర్తి, పులిదండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకే స్ఫూర్తిదాయకం

రామచంద్రపురం: భారత దేశ రాజ్యాంగం ప్రపంచ దేశాలకే స్ఫూర్తిదాయకంగా నిలిచిందని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ప్రపంచ మేధావిగా నిలిచారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి సూర్యప్రకాశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు దిశా నిర్దేశం చేసిన అంబేడ్కర్ అట్టడుగు వర్గాల ఆశాజ్యోతిగా నిలిచారని కొనియాడారు. రాజ్యాంగం గొప్పదనాన్ని ఆయన వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీదర్, పార్టీ నేతలు పెట్టశ్రీనివాసరావు, పెంటపాటి శ్రీను, పోతంశెట్టి గోపాలకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లోను, గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, ఆధ్వర్యంలో వేగాయమ్మపేటలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

మండపేటలో..

మండపేట: భారత రాజ్యాంగ దినోత్సవం మండలంలోని ద్వారపూడి జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా జరిగింది. హెచ్ఎం సవితాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో డాక్టర్ అంబేడ్కర్, బాబూ రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అలాగే బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం వద్ద రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

రాయవరం: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన నివాళులర్పించారు. వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఉద్యోగులతో ఎంపీడీవో ప్రతిజ్ఞ చేయించారు. మాచవరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు భారత దేశ ఆకారంలో కూర్చుని దేశభక్తిని చాటుకున్నారు.



వేగాయమ్మపేటలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించి ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ పద్మజ్యోతి



ద్వారపూడి జెడ్పీ హైస్కూల్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు